క్లుప్తంగా

రేజేరులో 'పొలంబడి'



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శిరీష

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. అధిక దిగుబడులకు పాటించాల్సిన సాగు పద్ధతులు, మెలకువలను ఏవో కె.శిరీష రైతులకు వివరించారు. పంట వేసిన తర్వాత మిత్రపురుగులు పంటకు ఏ విధంగా మేలు చేస్తాయి.. శత్రుపురుగులు పంటకు ఎలా హాని చేస్తాయన్న విషయం తెలిపారు. అనంతరం పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే ప్రతీ రైతు తమ పంటకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



గంగమ్మ(ఫైల్)

బాడంగి: మండలంలోని చినభీమవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు యామల గంగమ్మ(104) మృతి చెందారు. గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం తెల్లవారుజామున చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు ఉన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాజాం: సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీ కె.చంద్రరావు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ ఆర్‌బీకే వద్ద సాగు పద్ధతులపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు రావాలంటే తప్పనిసరిగా సాగు పద్ధతులు అనుసరించాలన్నారు. సస్యరక్షణ, ఈ–క్రాప్ నమోదు, పంటకోత ప్రయోగాలు, పంటమార్పిడి విధానాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఏవో రేణుకాసాయి, సర్పంచ్ బి.బోడమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఉనుకూరులో ఎరువులు అందుకున్న రైతులతో అధికారులు

రేగిడి: రైతులకు అందుబాటులో డీఏపీ, యూరియా ఎరువులు ఉన్నాయని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని వెంకంపేట, ఉనుకూరు, బూరాడ తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో చేస్తున్న ఎరువుల విక్రయాలను గురువారం పరిశీలించారు. అధిక మోతాదులో పంటలకు ఎరువులు వేయొద్దని, అవసరం మేరకే వేయాలని తెలిపారు. ఎరువులు కావాల్సిన వారు ఆర్‌బీకేలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

బొబ్బిలి: ప్రముఖ విద్యావేత్త, గణిత మేధావి ఎస్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి రాసిన మంచిబడి, అంకెలవింతలు అనే పుస్తకాలను స్థానిక పట్టణంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న మానవ హక్కుల మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చింత శారద, విశాఖకు చెందిన ఫిల్మ్ జర్నలిస్ట్ నవీన్ ప్రసాద్ తదితరులు కలిసి ఎస్.వి.ఆర్‌ను సన్మానించి, ఆయన ప్రతిభ, సేవలను ప్రశంసించారు.

మార్కెట్‌కు 'శ్రావణ' కళ



బండి దగ్గర పూలు కొనుగోలు చేస్తున్న మహిళ

రాజాం సిటీ: శ్రావణమాసం కావడంతో వరలక్ష్మీ వ్రతానికి అవసరమైన పూజాసామగ్రి కొనుగోలుకు మహిళలు అధిక సంఖ్యలో గురువారం రాజాం చేరుకున్నారు. దీంతో వారపుసంతతో పాటు మార్కెట్, బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. మహిళలు పూలు, పండ్లు, కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపగా, ఇదే అదనుగా భావించిన వ్యాపారులు వాటి ధరలు పెంచేశారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



రేగిడి: కాగితాపల్లిలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



తెర్లాం: కుసుమూరులో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాగితాపల్లి, పారంపేట గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓ వైపు గ్రామాల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రతీ ఇంటికి రూ.లక్షకు పైగానే లబ్ధి చేకూరిందన్నారు. పథకాల ద్వారా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చెల్లించడంతో అవినీతి లేదన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అందుతున్న పారదర్శక సేవలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆయా వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగనన్న పాలనకు జనం జేజేలు పలుకుతున్నారన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో టీడీపీ మళ్లీ మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమైందని, ఆ పార్టీని నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పార్టీ నేతలు దూబ సూరపునాయుడు, కిమిడి శ్రీరామ్మూర్తి, విశ్వేశ్వరరావు, మురళీధర్‌రావు, మధుసూదనరావు, గౌరునాయుడు, సీలంనాయుడు, ఈఓపీఆర్‌డీ హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి..

తెర్లాం: రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. మండలంలోని కుసుమూరు గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఏ ఇంటికి ఎంతమేర ప్రభుత్వ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందో వివరించారు.

గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగనన్న అమలు చేశారని, అర్హతే ప్రామాణికంగా ప్రతీ కుటుంబానికి మేలు జరిగేలా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ విధానాల ద్వారా రూ.3 లక్షల కోట్లపైగా నిధులు ప్రజల ఖాతాల్లో చేరాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చి, సీఎం జగన్ రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సత్యంనాయుడు, బొబ్బిలి, తెర్లాం మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, కుసుమూరు సర్పంచ్ టి.సత్యంనాయుడు, ఎంపీటీసీ టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: దత్తిరాజేరు మండలం, మరడాం దగ్గర శుక్రవారం జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో మండల స్థాయి పార్టీ నాయకులతో గురువారం సమావేశమైన ఆయన సీఎం సభ విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేశారు. మండలానికి మొత్తం 33 ఆర్టీసీ బస్సులు కేటాయించడం జరిగిందని, ఇవి ఉదయమే గ్రామాలకు చేరుకుంటాయని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున బస్సుల ద్వారా సభాప్రాంగణానికి వచ్చేలా అక్కడి స్థానిక నాయకులు చూసుకోవాలన్నారు. అవసరమైన చోటుకు అదనపు బస్సులను గానీ ఆటోలను గానీ ఏర్పాట్లు చేస్తామన్నారు. సాలూరు నియోజకవర్గ పరిధిలోని మెంటాడ మండలం, చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం మరడాం వద్ద సీఎం బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల వైస్ ఎంపీపీ బి.రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రేగిడి: దేవుదల కేజీబీవీని సందర్శిస్తున్న ఎంఈవో ఎరకయ్య



వంగర: విద్యార్థులతో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్న ఎంఈవో దుర్గారావు

రేగిడి: విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. గురువారం మండలంలోని దేవుదళలో ఉన్న కేజీబీవీని సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయాలని, వేడివేడిగా ఉన్నప్పుడే భోజనం వడ్డించాలని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి..

వంగర: విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో వై.దుర్గారావు అన్నారు. గురువారం మండలంలోని ఎం.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన ప్రతీ విద్యార్థి విద్యాసామర్థ్యాలు మెరుగయ్యేలా బోధన చేయాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ సరఫరా చేసిన ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థులకు వేశారు.

అన్ని వసతులు ఉండాలి..

రాజాం: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఉండాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. గురువారం స్థానిక పట్టణంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను పరిశీలించిన ఆయన పాఠశాలల ప్రారంభ సమయం, విడిచిపెట్టే సమయంపై ఆరాతీశారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, బెంచీలు, కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఉండేలా చూడాలని తెలిపారు.

భారీ వర్షం



కాగితాపల్లిలో కురుస్తున్న వర్షం

రేగిడి: మండలంలోని కాగితాపల్లి, బూరాడ, చిన్నశిర్లాం గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లు ఎండల కారణంగా ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. అలాగే ఖరీఫ్ సాగులో భాగంగా రైతులు పండిస్తున్న వరి, మొక్కజొన్న, చెరకు పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● విజయోత్సవ ర్యాలీ

చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో పలుచోట్ల విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్, జయహో ఇస్రో అని నినాదాలు చేస్తూ చంద్రయాన్–3 ప్రయోగ విశిష్టతను వివరించారు. భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచ నలుమూలలకు చాటిచెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలన్నారు. మరికొన్నిచోట్ల చంద్రయాన్–3 మిషన్ నమూనా ఆకారంలో ఉండి, మానవహారం చేపట్టి, విద్యార్థులు సందడి చేశారు.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో విజయోత్సవ ర్యాలీలో విద్యార్థులు



వంగర: విజయోత్సవ ర్యాలీకి సిద్ధమవుతున్న వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు



రామభద్రపురం: మానవహారం చేపట్టిన నాయుడువలస యూపీ స్కూల్ విద్యార్థులు



సంతకవిటి: చంద్రయాన్–3 మిషన్ నమూనా ఆకారంలో సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

29న క్యాంపస్ ఇంటర్వ్యూలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ టి.కృష్ణమూర్తి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అరబిందో, కొహినో ఫార్మా కంపెనీల్లో ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్మీడియట్, డిప్లొమో, ఐటీఐ చదివి, 25 సంవత్సరాలు నిండిన వారంతా అర్హులన్నారు. అభ్యర్థులు అన్ని అర్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 8688156216, 8688003060 సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని నాయుడు కాలనీలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం పర్యటించి, అక్కడి రోడ్లు, పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టి, ప్రజల ఆరోగ్యం కాపాడాలని సూచించారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి పైపులైన్‌ల మరమ్మతులు



పాడైన పైపులైన్లను పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

రాజాం: పట్టణ ప్రధాన రోడ్డులో మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్‌లను యుద్ధప్రాతిపదికన బాగుచేశారు. గురువారం పాడైన సబ్ పైపులైన్‌లను ఏఈ పి.వెంకట్ పరిశీలించి, వాటిని బాగు చేయించారు. రోడ్డు విస్తరణలో భాగంగా పైపులైన్లు పాడవుతున్నాయని, ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా కొన్నిచోట్ల మరమ్మతులు, మరికొన్నిచోట్ల కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.

టీడీపీ నేతల ఆరోపణలు అర్థరహితం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మెంటాడ మండలంలోని చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గురువారం సమావేశమయ్యారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సీఎం జగన్ కార్యక్రమాలు, సభకు హాజరు కావాలని కోరారు. చినమేడపల్లిలో జరిగే ఆ కార్యక్రమం అనంతరం దత్తిరాజేరు మండలంలోని మరడాం వద్ద సీఎం బహిరంగ సభ ఉంటుందన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అనవసరమైన ఆరోపణలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నంలో ప్రతిపక్షాలు ఉన్నాయన్నారు. బూటకపు మాటలు చెబుతూ ప్రజలను నమ్మించి, మోసం చేసే నైజం టీడీపీ నాయకులదని విమర్శించారు. గతంలో అభివృద్ధి కోసమేనని పార్టీ ఫిరాయించిన బొబ్బిలి రాజులు ప్రజలకు, ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. కనీస అభివృద్ధి చేయలేని వారు గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి, ఓర్వలేకపోతున్నారన్నారు. ఎక్కడ ఏ అభివృద్ధి పని జరిగినా తమకు తెలియనట్లు, అది అసలు అభివృద్ధి పనే కాదన్నట్లు టీడీపీ నేతలు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. కొట్టక్కి గ్రామ రోడ్డు నిర్మాణం నాణ్యతపై టీడీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులను కలెక్టర్ ఆదేశాల మేరకు చేయడం జరుగుతోంది కావున వాటికి పంచాయతీ తీర్మానాలు అవసరం లేదన్నారు. ఆ విషయం తెలుసుకోకుండా విమర్శలు చేయడం మీ అమాయకత్వానికి నిదర్శమని టీడీపీ నాయకులను ఉద్దేశించి అన్నారు. అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనించారని, వచ్చే ఎన్నికల్లో మీకు మళ్లీ తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాల నివారణే ధ్యేయం

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు



బూసాయవలస వెల్‌నెస్ సెంటర్ సందర్శనలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు

రామభద్రపురం: ప్రసూతి మరణాల నివారణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు తెలిపారు. మండలంలోని బూసాయవలస గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేస్తున్న వైద్య పరీక్షలను ఆయన గురువారం పరిశీలించారు. అంతకుముందు వెల్‌నెస్ సెంటర్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో లేదోనని తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రసూతి మరణాల్లో ఎక్కువగా గర్భిణుల్లో నెలకొంటున్న రక్తహీనతే ప్రధాన కారణమని, ప్రభుత్వం దాని నివారణకు చర్యలు తీసుకుంటోందన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చిన తల్లిని డిశ్చార్జ్ చేసేముందు హిమోగ్లోబిన్ పరీక్ష చేస్తున్నామని తెలిపారు. తీవ్రస్థాయిలో రక్తహీనతతో బాధపడేవారిని గుర్తించి, సుక్రోజ్ ఇంజెక్షన్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాలు చేయడం జరుగుతోందని, గర్భిణులు ప్రసవానికి ప్రభుత్వాస్పత్రులను ఆశ్రయించాలని కోరారు. ఆయన వెంట ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సంతకవిటి: ఎం.ఆర్.అగ్రహారంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్



రేగిడి: ఉప్పర్నాయుడువలసలో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

సంతకవిటి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యం బాగుంటుందని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన దోమల నివారణకు చర్యలు చేపట్టారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. కాచి, వడపోసిన నీటిని తాగాలని, వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలు తినాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంతకవిటి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్రప్రసాద్, సర్పంచ్ డి.దాలినాయుడు, తహసీల్దార్ ఎ.సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు..

రాజాం: స్థానిక పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

ఫీవర్ సర్వే చేయాలి..

రేగిడి: గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, ఫీవర్ సర్వే చేయాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించి, వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అంతకుముందు జ్వర లక్షణాలతో బాధపడుతున్న పలువురి ఆరోగ్యం తనిఖీ చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఇంటితో పాటు ఇళ్ల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు



ప్రొక్లెయినర్‌తో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

రాజాం:

గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ) కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో మండలంలోని సీఎస్ఆర్ పురంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవల ఆ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి అక్కడి రోడ్డు, డ్రైనేజీ సమస్యలను ఎంపీపీ లావేటి సులోచన తీసుకువెళ్లారు. ఈ క్రమంలో రూ.20 లక్షలు మంజూరు చేయగా, అందులోని రూ.10 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ప్రొక్లెయినర్ సహాయంతో కాలువల ఏర్పాటు కోసం మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ పనులు జరుగుతుండడంతో సర్పంచ్ రమాదేవి, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.